
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 నవంబర్ 2025
5
చిత్తూరు



## పది పరీక్షల షెడ్యూల్ విడుదల

### మార్చి 16 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** 2025 పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. మార్చి 16వ తేదీ నుండి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 16వ తేదీ సోమవారం ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు, 18వ బుధవారం తేదీ సెకండ్ లాంగ్వేజ్, 20వ తేదీ ఇంగ్లీష్, 23వ తేదీ మ్యాథమెటిక్స్, 25వ తేదీ ఫిజికల్ సైన్స్, 28వ తేదీ బయాలజికల్ సైన్స్, 30వ తేదీ సోషల్ స్టడీస్, 31వ తేదీ ఫస్ట్ లాంగ్వేజ్ కంప్యూటర్స్, ఏప్రిల్ ఒకటో తేదీ ఎస్ఎస్సి ఒకేషనల్ కోర్సుకు సంబంధించిన పరీక్షలు నిర్వహించనున్నారు.



రాష్ట్రపతి ముర్ముకు శ్రీవారి చిత్రపటాన్ని అందిస్తున్న టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు

## తిరుమలలో భక్తులతో రాష్ట్రపతి మమేకం

### చాక్లెట్లు పంచిన ద్రౌపది ముర్ము

**ప్రజాశక్తి -తిరుమల:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మొదట క్షేత్రాధిపతి వరాహస్వామిని రాష్ట్రపతి ముర్ము దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయం వద్దకు వచ్చారు. మహాద్వారం వద్ద రాష్ట్రపతికి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అర్చకులు స్వాగతం పలికారు. ధ్వజస్తంభాన్ని దర్శించుకున్న తర్వాత రాష్ట్రపతి ముర్ము శ్రీవారి సేవలో పాల్గొన్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో రాష్ట్రపతికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేశారు. రాష్ట్రపతికి ఛైర్మన్ బీఆర్ నాయుడు శ్రీవారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను, టీటీడీ 2026 క్యాలెండర్, డైరీలను అందజేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమలలో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. శ్రీవారి దర్శనానంతరం పద్మావతి అతిథి గహానికి తిరుగు ప్రయాణమైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాంభగీచ బస్ స్టేషన్ వద్ద రోడ్డు పక్కన నిల్చున్న భక్తులను పలకరించారు. ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి ప్రజలతో మమేకమయ్యారు. తన కాన్వాయ్ ఆపి మరి అక్కడ ఉన్న వారిని కలిశారు. అనంతరం శ్రీవారి భక్తులకు రాష్ట్రపతి చాక్లెట్లను పంచారు. ఆలయం వెలుపల మీతో ఫొటో దిగుతామంటూ టీటీటీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కోరగా రాష్ట్రపతి సానుకూలంగా స్పందించారు. హెూంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి రామనారాయణరెడ్డితోపాటు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని రాష్ట్రపతితో కలిసి ఫొటో దిగారు. సమీపంలోనే ఉన్న ఈవో సింఘాల్, కలెక్టర్ వెంకటేశ్వర్‌లను రాష్ట్రపతి పిలవడంతో వారూ వచ్చి ఫొటో తీయించుకున్నారు.

### దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత: కలెక్టర్

## సహాయ పరికరాలు పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

**ప్రజాశక్తి- ఐరాల:** దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతను ప్రభుత్వం ఇస్తున్నదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఐరాల మండలంలోని అగ్రగ్రామం జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులు సహాయ పరికరాల గుర్తింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, పూతలపట్టు నియోజకవర్గం శాసనసభ్యులు మురళీమోహన్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 20 నుండి 25రకాల దివ్యాంగులకు, వృద్ధులకు చెవి సమస్య ఉంటే హీరింగ్ ఎయిడ్స్ ఇవ్వడం లేదంటే ఒక డివైస్ ఇవ్వడం, ఒక వీల్ చైర్, ఒక స్టిక్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సుమారుగా 3600 మంది లబ్ధి పొందడం జరిగిందని, రూ.4 కోట్ల 50 లక్షల సబ్సిడీ మొత్తం ఫ్రీ ఆఫ్ కాస్ట్‌తో కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇవ్వడం జరిగిందన్నారు. ఈసారి కూడా ఈ కౌన్సిలింగ్ చిత్తూరు జిల్లాలో ఎనిమిది చోట్ల జరుగుతున్నాయన్నారు. గురువారం కూడా కార్వేటినగరంలో పూర్తి చేయడం జరిగిందని, గ్రామంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగ వైకల్యం అనేది వారిలో మానసికంగా ఇబ్బందులు కలగజేయకుండా వారిలో ఆత్మవిశ్వాసం దెబ్బతినకుండా సమాజంలో అందరితో సమానం బ్రతకడం కోసం ఇలాంటి కార్యక్రమాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తూ ఉందని తెలిపారు. జిల్లాలో కొన్ని వేల మందికి వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు, బ్యాటరీ సైకిల్, సపోర్టింగ్ స్టిక్స్, కంటి అద్దాలు వంటి పరికరాలు అందించడం జరిగిందని తెలిపారు. సాంఘిక సంక్షేమశాఖ పీడీ విక్రమ్ కుమార్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంవాసుల కల నెరవేరింది..

- హంద్రీ నీవా, కృష్ణా జలాలకు జలహారతి కార్యక్రమంలో నారా భువనేశ్వరి



కృష్ణా జలాలకు జలహారతి ఇస్తూ..

**ప్రజాశక్తి - శాంతిపురం:** ఆంధ్రప్రదేశ్‌ను కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్, ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పంకు కృష్ణా జలాలు తీసుకొచ్చి కుప్పం వాసుల దశాబ్దాల కల నెరవేర్చారని అన్నారు. మహిళలకు ఆర్థిక భద్రత అవసరమని, స్వయం ఉపాధి ద్వారా వారికి మరింత ఆదాయం లభిస్తుందని అన్నారు. 3వ రోజు కుప్పం నియజకవర్గం పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో నారా భువనేశ్వరి పాల్గొన్నారు.

నడింపల్లి గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరి మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో చంద్రబాబు డ్వాక్రా స్థాపించారని, నేడు డ్వాక్రా మహిళలు బ్యాంకుల నుంచి వేల కోట్ల రుణాలు తీసుకుని సకాలంలో చెల్లిస్తూ పారిశ్రామికవేత్తల స్థాయికి ఎదిగారని అన్నారు. మహిళల్లో ప్రతిభను వెలికితీసి వారికి సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా పారిశ్రామిక వేత్తలుగా తయారుచేయడంలో ఎలీప్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రమాదేవి ఆమె టీం సభ్యులంతా ఎలీప్ ద్వారా అనేకమంది మహిళలను ఔత్సాహిక పారిశ్రామివేత్తలుగా తీర్చిదిద్దారని, అలాగే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా కూడా మహిళల ఆర్థిక ప్రగతికి పాటుపడుతున్నామని, వారి స్వయం ఉపాధికి చేయూత అందిస్తున్నామని అన్నారు.

**కృష్ణమ్మకు జలహారతి..**

తుమ్మిసి పెద్దచెరువు వద్ద జలహారతి కార్యక్రమంలో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణమ్మకు సారె, పూలు, పసుపు కుంకమలు సమర్పించి జలహారతి ఇచ్చారు. అంతకుముందు శాంతిపురం నుంచి తుమ్మిసి వరకూ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. మహిళా ప్రయాణికులతో ముచ్చటించారు. భువనేశ్వరి ఆర్టీసీ బస్సు ఎక్కగానే ఆధార్ తప్పనిసరి అని మహిళా కండెక్టర్ చెప్పడంతో విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్నావని మహిళా కండెక్టర్‌ను భువనేశ్వరి అభినందించారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు శాంతారామ్, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ గోనివారి శ్రీనివాసులు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, ఏంసి ఛైర్మన్ రాజు, మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్, కడా అడ్వైజర్ కమిటీ సభ్యురాలు సుగుణమ్మ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చంద్రకళ పాల్గొన్నారు. అలాగే శాంతిపురంలో నూతనంగా నిర్మించిన నందిగం వారి శ్రీలక్ష్మీ వైభవ్ కాంప్లెక్స్‌ను భువనేశ్వరి చేతుల మీదుగా ప్రారంభించారు.

**రామకుప్పం:** రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాలలోనూ ఆర్థిక ప్రగతి సాధించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఎన్టీ ఆర్ ట్రస్ట్ ఎండి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నాలుగు రోజుల కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మూడవరోజైనా శుక్రవారం రామకుప్పం మండలంలో ఆమె పర్యటించారు. మండలంలోని ఆనిగానూరులో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాన్ని ఆమె సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. విజలాపురం పెద్ద చెరువులో హంద్రీ నీవా కృష్ణా జలాలకు వేద పండితుల మంత్రూచ్చారన మధ్య కృష్ణమ్మకు జాలహారతి ఇచ్చారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడ పీడీ వికాస్ మార్మత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, ఉడా ఛైర్మన్ సురేష్ బాబు, మునస్వామి, పట్రానారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ వైభవ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం



## సకాలంలో సమస్యలు పరిష్కరించండి

### ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సకాలంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలిపేందుకు వచ్చిన ప్రజలతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడారు. వారి ఇబ్బందులను, కష్టాలను అడిగి తెలుసుకుని, వారి నుంచి వినతులు స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఎక్కువగా రెవెన్యూ భూసమస్యలు, ఇంటి స్థలాలు, పింఛన్లు, ఉద్యోగ అవకాశాలు, కాలనీల్లో సౌకర్యాలు, ఇతర సమస్యలపై అర్జీలు వచ్చాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో మొత్తం 74 వినతులు అందాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపించారు. కార్యక్రమంలో మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, తహశీల్దారు జయప్రకాశ్, ఎంపీడీవో శ్రీనివాసులు, హౌసింగ్ డీఈ శ్రీధర్ పాల్గొన్నారు.

## కల్వర్టర్లు నిర్మించండి

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్లు, వాగులు, కాలువలపై శిథిలావస్థకు చేరిన కల్వర్టర్ల స్థానంలో కొత్తవి నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే గుడిపాల మండలం బసవాపల్లి పంచాయతీ పరిధిలోని కోలావూరు – సీకె పల్లి రోడ్డును, కల్వర్టర్లను పరిశీలించారు. కల్వర్టరు పాడవడంతో పాటు, తక్కువ ఎత్తులో ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు ఎమ్మెల్యేకి వివరించారు. వర్షాల నేపథ్యంలో దెబ్బతిన్న రోడ్లను, కల్వర్టర్లను వెంటనే బాగుచేయాలని, మండలంలో 10 గ్రామపంచాయతీ పరిధిలో 15 కల్వర్టర్ల స్థానంలో కొత్తవి నిర్మించాలని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు కాజూరు బాలాజీ, సురేష్, వెంకటేష్ యాదవ్, నరేష్, పచ్చప్ప పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో మదర్ థెరిస్సా విద్యార్థుల ప్రతిభ



**ప్రజాశక్తి-పెద్దపంజాణి:** మదనపల్లిలోని విజయ భారతి స్కూల్లో జరిగిన 69వ జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్ కరాటే పోటీలలో మదర్ థెరిస్సా విద్యార్థులు గెలుపొందినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డేవిడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ సెక్రటరీ బాబు, నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో మదర్ థెరిస్సా స్కూలు విద్యార్థులు అండర్ 14 – 45 కేజీ విభాగంలో బి.మోక్షజ్ఞ రాయల్, 55 కేజీ విభాగంలో జ్ఞానదీప్ గెలుపొందినట్లు తెలిపారు. అండర్ –17 విభాగంలో 58కేజీ కేటగిరిలో ఎం.హేమేష్ విజయం సాధించారని, గెలుపొందిన విద్యార్థులు ఈనెల 23 నుంచి 26తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం డాక్టర్ రవీంద్ర బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ డేవిడ్, కరాటే మాస్టర్ సదాశివను విద్యార్థులను అభినందించారు.

## అవార్డు గ్రహీతలకు సన్మానం

**ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:** 2025 సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు (ఉర్దూ విభాగం ) గ్రహీతలు జి.ముక్తార్ అహ్మద్, మహబూబ్ భాషా ఇద్దరినీ జిల్లా ఏపిటిఎఫ్ శాఖ తరపున ఘనంగా సన్మానించారు. చిత్తూర్ నగరం జైహింద్ పాఠశాలలో ఏర్పాటుచేసిన సన్మాన సభ జిల్లా అధ్యక్షులు జగదీష్ అధ్యక్షతన జరిగింది. గత 23 సంవత్సరాలు నుండి ఉపాధ్యాయులుగా, సంఘ నాయకులుగా విశేష కృషి చేసిన ముక్తార్ అహ్మద్, మహబూబ్ బాషా, జాతీయ అవార్డు పొందడం ఉపాధ్యాయ వర్గానికి గర్వకారణమని అన్నారు. ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ ముక్తార్ లాంటి నాయకులు సంఘానికి అవసరమని, సేవభావంతో అనేక కార్యక్రమాలు చేశారని కొనియాడారు. సన్మాన గ్రహీతలు ఈ అవార్డు తమ బాధ్యతలు పెంచిందని తెలిపారు. సలహాదారు గోపినాథం, ప్రకాష్, సీనియర్ నాయకులు త్యాగరాజ్ నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, అమర్నాథ్‌రెడ్డి, సబ్ కమిటీ నాయకులు శివశంకర్, వేణు, ఆఫ్జాల్, లక్ష్మీపతి పాల్గొన్నారు.




## ఓటర్ల మ్యాపింగ్‌లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డిఆర్ఓ మోహన్‌రావు



**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** ఓటర్ల మ్యాపింగ్లో బీఎల్ఓలు నిర్లక్ష్యం వీడాలని, పారదర్శకంగా మీ విధులు నిర్వర్తించాలని డిఆర్ఓ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ డిఆర్ఓ ఛాంబర్ నుండి టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో 40 సంవత్సరాల వయసు పైబడిన ఓటర్ల మ్యాపింగ్ ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులు, బిఎల్‌వోలను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 15,74,844 మంది ఓటర్లు ఉన్నారని వీరిలో 8,35,533 మంది 40 ఏళ్లు పైబడినవారిగా సంబంధిత బిఎల్వోలు యాప్ ద్వారా గుర్తించారు. సంబంధిత బిఎల్వోలు 40 సంవత్సరం పైబడినవారిని ఓటర్ల మ్యాపింగ్‌లో 65శాతం నమోదు చేశారని, మిగిలిన 35 శాతాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, నియోజకవర్గ ఎన్నికల అధికారులను, నియోజకవర్గ సహా ఎన్నికల అధికారులను, మండలాల ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో మొత్తం కొత్తగా చేర్చబడిన కుటుంబాల సభ్యుల ఓటర్ల సంఖ్య 66,891 మంది ఓటర్లను సంబంధిత బిఎల్వోల ద్వారా మ్యాపింగ్ చేయడం జరిగిందని తెలిపారు. ఈసీ నిర్దేశించిన విధంగా యాప్‌లో వివరాలన్నీ నమోదు చేయాలని స్పష్టం చేశారు. 2025 ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలని తెలిపారు. అనంతరం టెలికన్ఫరెన్స్ ద్వారా అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి పొందడానికి రైతుల భూమి వివరాలు ఆధార్ నెంబర్‌కు అనుసంధానం చేయబడి ఉండాలని, వెబ్ ల్యాండ్‌లో సరైన వివరాల ఉన్న రైతులకు అన్నదాత సుఖీభవ వర్తిస్తుందని పై విషయాల్లో ఎమ్మార్వోలు, వీఆర్వోలు, సమగ్ర వివరణ చేపట్టాలని ఆదేశించారు.

## మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత: ఎమ్మెల్యే



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** చిత్తూరు నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూ సిమెంట్ రోడ్లు, కాలువలు, వీధి దీపాలను దశలవారీగా నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. శుక్రవారం నగరంలోని 7వ వార్డులోని బాపూజీ నగర్, 46వ వార్డులోని విజయలక్ష్మి కాలనీలో రూ.28.90 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, కాలువను ఎమ్మెల్యే, మేయర్ ఎస్.అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిత్తూరును స్మార్ట్ నగరంగా అభివృద్ధి చేయడంలో భాగంగా మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధిలైట్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. సంతపేట నుంచి పట్రాంపల్లి, పాంచాలిపురం తదితర ప్రాంతాలకు వెళ్లే వారికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని.. స్థానిక మహిళలు, నాయకులు వినతి మేరకు సిమెంట్ రోడ్డు, కాలువను నిర్మించినట్లు చెప్పారు. ఈ రోడ్డు పనులు ప్రారంభించిన నెలరోజుల్లోనే పూర్తి చేసి ప్రారంభోత్సవం చేశామన్నారు. నగరపాలక పరిధిలో విలీనమైన ప్రాంతాలను అభివృద్ధి చేయడం కోసం రానున్న శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో సీఎం, మున్సిపల్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ రమేష్ నాయుడు, వెంకటేష్ యాదవ్, టిడిపి నగర అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి పచ్చప్ప పాల్గొన్నారు.

### స్వయం సహాయక సంఘాల జీవనోపాదులు పెరగాలి

## క్షేత్రస్థాయిలో ప్రణాళిక సిద్ధం చేయాలి: డిఆర్‌డిఎ పీడీ





సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి

**ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)**

జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధులు పెరిగేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని చిత్తూరు డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం డిఆర్డిఏ సమావేశ మందిరంలో డిపిఎంలు, ఏపీఎంలు, సీసీలు, ఇతర డిఆర్డిఏ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వాలంబన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను చేపట్టాయని ఈ పథకాలన్నీ సంఘ సభ్యులకు చేరువ కావాలన్నారు. అనేక పథకాలు జిల్లాలోని వివిధ శాఖలతో ముడిపడి ఉన్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయం చేసుకొని తమ పరిధిలోని సంక్షేమ ఫలాలను సంఘ సభ్యులకు అందించేందుకు కృషి చేయాలని అప్పుడే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని దీని దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయి సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సంఘాల్లోని చదువుకున్న సభ్యులను గుర్తించి స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గ్రామాల్లో ఉన్న సాంఘిక దురాచారాల వల్లే చోటు చేసుకునే పరిణామాలను వివరించి వారిని చైతన్యపరిచి ఈదురాచారాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా హార్టికల్చర్ పశుసంవర్ధక శాఖలు సంఘ సభ్యులకు అనేక పథకాలను అందించే అవకాశం ఉందని ఈపథకాలన్నీ సంఘాలు సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన పథకాలు అర్హులైన ప్రతి సంఘానికి అందే విధంగా క్షేత్రస్థాయిలో అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. సంఘంలోని చదువుకుని సాంకేతికరంగం పట్ల అవగాహన ఉన్న సభ్యులను గుర్తించి వారి ఎంచుకునే వ్యాపార రంగాలకు ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. ఈ విషయంలో బ్యాంకర్లు తో చర్చించాలన్నారు. రుణాల మంజూరు రికవరీ పూర్తి పారదర్శకంగా కొనసాగాలని ఇందులో ఎలాంటి పొరపాటు జరిగిన పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈజీ మార్ట్ పై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో డీపీఎం రవి, వరలక్ష్మి, ఏపీఎంలు మధుసూదన్, సుబ్బారెడ్డి, హేమ, సీసీలు, మండలస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

### నేషనల్ లైబ్రరీ ఆఫ్ ఇండియాతో

## ద్రావిడ విశ్వవిద్యాలయం ఎంఓయు



ఎంఓయు పత్రాన్ని అందుకుంటున్న ఆచార్య విసి దొరస్వామి

**ప్రజాశక్తి- గుడిపల్లి:** స్థానిక ద్రావిడ విశ్వవిద్యాలయం కోల్‌కత్తాలోని నేషనల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదిరింది. ఈ అవగాహన ఒప్పందం లైబ్రరీ, సమాచార శాస్త్ర (ఎల్ఐఎస్) విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ శిక్షణ కోసం ఒక సహకార చట్రాన్ని ఏర్పాటు చేస్తుంది, అలాగే లైబ్రరీ, సమాచార శాస్త్రంలోని ప్రత్యేక రంగాలలో పరిశోధన, అభివృద్ధిలో ఉమ్మడి చొరవలను ఏర్పాటు చేస్తుంది. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం, ద్రావిడ విశ్వవిద్యాలయంలోని ఆచార్యులు, విద్యార్థులు నేషనల్ లైబ్రరీ ఆఫ్ ఇండియాలో విస్తృతమైన పుస్తకాలు, పత్రాల సేకరణను పొందగలరు. ఈ ఒప్పందం విశ్వవిద్యాలయ సిబ్బందికి శిక్షణ, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలను కూడా సులభతరం చేస్తుంది, రెండు సంస్థల మధ్య విద్యా వృత్తిపరమైన సహకారాన్ని బలోపేతం చేస్తుంది. ఈ అవగాహన ఒప్పందంపై నేషనల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ తరపున ప్రిన్సిపల్ లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ డాక్టర్ శివప్రసాద్ సేనాపతి, కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.దొరస్వామి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కిరణ్ కుమార్ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.శ్యామల, డీన్ అకడమిక్ అఫైర్స్, ప్రొఫెసర్ డి.శ్రీనివాసకుమార్, ప్రొఫెసర్ ఎంసి.కేశవమూర్తి, డాక్టర్ ఎ.కిషోర్, డాక్టర్ ఎస్.నరేష్ పాల్గొన్నారు.

## విద్యతోనే బంగారు భవిష్యత్



చెక్కులు అందిస్తున్న దాతలు

**ప్రజాశక్తి- పుంగనూరు:** నేటి యువతరం పట్టుదల, క్రమశిక్షణ పాటిస్తే బంగారు భవిష్యత్తు అవుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చొక్లా నాయక్ అన్నారు. మండలంలోని మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వార్షిక ఫీజులు శుక్రవారం చెల్లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేపటి భవిష్యత్తు మీ పైనే ఆధారపడుతుందని గ్రామీణ ప్రాంతం నుండి వెళ్లే విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. మండల పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈడిగపల్లి, పూజగానిపల్లి, చంద్రమాకులపల్లి పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 101 మందికి ఒక్కొక్కరికి రూ.125ల చొప్పున మొత్తం రూ.12,625లు వార్షిక ఫీజు చెక్కును దాతలు చేతుల మీదుగా చెక్కును అందించారు. పూజగానిపల్లి ఉన్నత పాఠశాలకు 36 మందికి రూ.4,500లు ఇరిగేషన్ శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న చోక్లా నాయక్ అందించారు. ఈడిగపల్లి 45 మందికి రూ.5,625లు బెంగళూరులో సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న భూక్యా భానుప్రసాద్ అందించారు. చంద్రమాకులపల్లి 21మందికి రూ.2,625లు భూక్యా జగదీష్ నాయక్ (రీసెర్చ్ స్కాలర్) అందించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సహకారంతో చెక్కు రూపంలో వారికి అందించారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఎస్‌టియు ప్రధానకార్యదర్శి మోహన్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ బుడ్డన, అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ పోకల మధుసూదన్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రెడ్డెమ్మ, వెంకటరమణ, సహాయకులు హేమలత, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** పివికేఎన్ ప్రభుత్వ కళాశాలలో (స్వయం ప్రతిపత్తి) చిత్తూరు డిగ్రీ కళాశాలలో మిగిలిన డిగ్రీ సీట్ల భర్తీకి ఉన్నత విద్యామండలి కేటగిరి –బి క్రింద స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జీవనజ్యోతి తెలిపారు. ఇంటర్ పూర్తి అయిన విద్యార్థులు ఒరిజినల్ ధృవపత్రాలతో కళాశాలలోని బిఏ 99630 63258, బీకాం 98499 59423, బీఎస్సీ 99851 65051 అదనపు సమాచారం కొరకు ఈనెంబర్లకు సంప్రదించాలని కోరారు. అలాగే డిగ్రీ స్పాట్ అడ్మిషన్లకు ఈనెల 24వ తేదీ చివరి తేదీ అని తెలిపారు.

# మరింత మెరుగ్గా పారిశుద్ధ్యం

## గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్లకు శిక్షణ


పెద్దపంజాణిలో..

**ప్రజాశక్తి - సోమల:** పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచి పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా పంచాయతీలలో ప్రజలు మంచి వాతావరణంలో జీవించే అవకాశం ఉందని ఎంపీడీవో జీవీఎస్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని పంచాయతీల పారిశుధ్య కార్మికులు మండల కేంద్రానికి చేరుకుని గ్రామంలో పలు వీధులలో పారిశుధ్య పనులు చేసి అనంతరం చెత్త నుండి సంపద కేంద్రం వద్ద మొక్కలు నాటారు. ప్రభుత్వం పారిశుధ్యంపై ఎక్కువ శ్రద్ధ చూపుతోందని దీనికోసం పంచాయతీలలో కార్యదర్శులు గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ఎప్పటికప్పుడు చెత్త తొలగించడం మురుగునీటి కాలువలను శుభ్రం చేయించడం చేయాలని ఇదే క్రమంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రజలకు వారి నివాసంలో ప్రాంతంలో ఖాళీ స్థలంలో మొక్కలు నాటే విధంగా అవగాహన కల్పించి విరివిగా మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణాన్ని తీసుకురావాలని కోరారు. బస్టాండ్ కూడలిలో ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గ్రీన్ అంబాసిడర్లు గ్రీన్ కార్డులు పాల్గొన్నారు.

**విజయపురం:** మండలంలోని కోసల నగరం గ్రామపంచాయతీలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం ఎంపీడీవో రాజేంద్ర నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి పంచాయతీలో ఉన్న గ్రీన్ అంబాసిడర్లు, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు కోసలనగరం పంచాయతీలో ఉన్న చెత్త చెదారం, డ్రైనేజీ శుభ్రం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రతి ఒక్కరు పారిశుధ్యం మెరుగుపరిచేందుకు కృషిచేయాలని, గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్తను సంపద తయారీ కేంద్రానికి తీసుకువెళ్లాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఎంఎస్ సురేంద్ర కుమార్, దుశాంత్, మోహన్, భరత్, బేబీ రాణి, సంపూర్ణ, జ్యోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


విజయపురంలో..


జీడీ నెల్లూరులో..

**గంగాధర నెల్లూరు:** పర్యావరణాన్ని పరిరక్షించడం పచ్చదనాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకోవాలని డిపిఓ సుధాకర్ రావు అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలలో చెత్తకుప్పలు లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టం చేయడమే లక్ష్యంగా రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ కృషి చేస్తుందని డిపిఓ సుధాకర్‌రావు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆర్‌జిఎస్ఏ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆర్ఎస్ డిజి టీం 5 అంశంలో పర్యావరణాన్ని పరిరక్షించడం పచ్చదనాన్ని పెంపొందించడంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముక్కలత్తూరు గ్రామపంచాయతీ, గంగాధర నెల్లూరు మండలంలో పూర్తిస్థాయిలో వేస్టేజ్, ట్యాంక్ క్లీనింగ్, శానిటేషన్, క్లోరినేషన్, ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. డిడిఓ రవికుమార్, జిల్లా కోఆర్డినేటర్ హరిప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో మనోహర్ గౌడ్, డిప్యూటీ ఎంపీడీవో శివయ్య, డిఆర్పి, డిపిఆర్సి గణేంద్ర, ఎంఎసిఎస్ ఎసి మనోహర్ బాబు, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

**పెద్దపంజాణి:** పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు విధిగా ఒక ఉద్యమంలా కృషి చేద్దామని ఎంపీడీవో బాలాజీ అన్నారు. శుక్రవారం రాయలపేట గ్రామపంచాయతీ సచివాలయంలో మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు ఎమ్మార్పీలు, సిఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులతో క్షేత్రస్థాయిలో శిక్షణ శిబిరం నిర్వహించారు. రాయలపేట సర్పంచ్ అరుణ మునిరాజ, పంచాయతీ కార్యదర్శులు రెడ్డిశేఖర్, శేఖర, ఎంఇఓ సుధాకర్ పాల్గొన్నారు.

**శాంతిపురం:** మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లకు రాళ్ళబూదుగూరులో హరిత రాయబారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధికారులు నాయకులు రాళ్ళబూదుగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి బస్టాండ్ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు రవినాయక్, శేఖర్ శివ శంకరయ్య, వనిత, అశ్విన్, హరీష్ కుమార్, గ్రామ సర్పంచ్ లక్ష్మీ మురుగేష్, ఉప సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

# క్రైం న్యూస్

## చిన్నారితో తల్లి ఆత్మహత్య

**ప్రజాశక్తి- చౌడేపల్లి:** మండలం వెళగంపల్లిలో శుక్రవారం 10 నెలల చిన్నారితో తల్లి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. 10 నెలల చిన్నారితో కలిసి తల్లి ఆదిలక్ష్మి (22) చెక్ డ్యామ్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. చిన్నారి పుట్టినప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికితీసిన పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.

మోటార్ సైకిల్ దొంగతనం కేసుల్లో

## ఇద్దరికీ ఆరు నెలల జైలు శిక్ష

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్**



చిత్తూరు పట్టణ పరిధిలో జరిగిన పలు మోటార్ సైకిల్ దొంగతనం కేసుల్లో నిందితులైన జయకుమార్, లోకనాధన్ (తమిళనాడు రాష్ట్ర నివాసులు)కు శుక్రవారం న్యాయమూర్తి షేక్ బాబాజాన్ 6 నెలల జైలు శిక్షను విధించారు. చిత్తూరు పట్టణంలో వరుసగా జరిగిన మోటార్ సైకిల్ దొంగతనం కేసులకు సంబంధించి చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వీరిపై ఆరు కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ క్రైమ్ టీమ్ దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచారు. సేకరించిన సాక్ష్యాధారాలు, దర్యాప్తు నివేదికల ఆధారంగా చిత్తూరు 4వ అదనపు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి షేక్ బాబాజాన్ నిందితులను దోషులుగా తేల్చి 6 నెలల జైలుశిక్ష విధించారు.

## ఇద్దరు స్మగ్లర్లకు ఏడాది జైలు శిక్ష

రూ.10,000 జరిమానా

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** భాకరాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2014లో నమోదైన ఎర్రచందనం కేసులో అప్పటి భాకరాపేట ఎస్ఐగా ఉన్న ప్రస్తుత 2 టౌన్ ఇన్‌స్పెక్టర్ నెట్టికంటయ్య కేసు నమోదు చేసి, ముద్దాయిలను రిమాండ్‌కు తరలించారు. అనంతరం దర్యాప్తు చేపట్టి, న్యాయవిచారణకు అవసరమైన ఆధారాలను సేకరించి కోర్టుకు సమర్పించారు. శుక్రవారం న్యాయవిచారణ అనంతరం ముద్దాయిలు వక్కల శ్రీనివాసులు, వక్కల జయచంద్రలకు న్యాయమూర్తి నరసింహమూర్తి సంవత్సరం కారాగార శిక్ష ఒక్కొక్కరికి రూ.10,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 3నెలల జైలు శిక్ష కూడా విధించినట్లు కోర్టు తీర్పు వెలువరించారు.

## బైక్ నుంచి జారిపడి వృద్ధుడు మృతి

**ప్రజాశక్తి- బంగారుపాళ్యం:** ద్విచక్ర వాహనం నుండి జారిపడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చిల్లగుండ్లపల్లి వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు తెలిపిన సమాచారం మేరకు.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా కాట్పాడి తాలూకా పెరిమిట్టూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డి (67) మండలంలోని కుమ్మరపల్లిలో బంధువుల చనిపోవడంతో ఆ కార్యక్రమానికి వచ్చి తిరిగి గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా చిల్లగుండ్లపల్లి వద్ద వాహనం నుండి జారిపడి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. శవపరీక్ష నిమిత్తం బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి దుర్మరణం



**ప్రజాశక్తి- తవణంపల్లి:** మండలంలోని పుణ్యసముద్రం ఎల్బీపురం గ్రామానికి చెందిన బి.వెంకటేష్ (54) ట్రాక్టర్ బోల్తాపడి మరణించాడు. శుక్రవారం వ్యర్థ పదార్థాలను ట్రాక్టర్ ట్రాలీలో లోడ్ చేసుకుని అగరంపల్లి వంతెన సమీపంలోని బహుదా నదిలో పందులకు మేతగా దించేందుకు వెళుత్తున్న సమయంలో ట్రాక్టర్‌పై నియంత్రణ కోల్పోయి బోల్తా పడినట్లు పోలీసులు తెలిపారు. ట్రాక్టర్, ట్రాలీ అతనిపై పడడంతో వెంకటేష్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనపై బాధితుడి భార్య చిట్టెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తవణంపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

## బస్సు- ద్విచక్ర వాహనం ఢీ

ముగ్గురికి గాయాలు

**ప్రజాశక్తి- సోమల:** సోమల నుండి కందూరు మీదుగా కలికిరికి వెళుతున్న పీలేరు డిపో ఆర్టీసీ అద్దె బస్సు నెల్లిమంద సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో బైక్‌పై వస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించారు. నెల్లిమంద పంచాయతీకి చెందిన రహీం సాహెబ్(50) రహంతుల్లా(48) రసూల్ సాహెబ్(40) ముగ్గురు స్వగ్రామం నుండి ఒకే ద్విచక్ర వాహనంలో వస్తుండగా సోమల నుండి కలికిరికి వెళుతున్న బస్సు ఎదురుగా రావడం రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే గాయపడ్డ వారిని సోమల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించి ఇద్దరి తలలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు సమాచారం. కాగా ప్రమాద విషయంగా పోలీసులకు ఆర్టీసీ డ్రైవర్ లిఖితపూర్వక ఫిర్యాదు అందజేసినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రతిభ చాటిన కడపనత్తం విద్యార్థులు



**ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి:** మండలంలోని కడపనత్తం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఎస్‌జిఎఫ్‌యు -14 సాఫ్ట్‌బాల్ ఎంపికపోటీలలో మెరిసి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాంచాల, పీఈటీ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల చిత్తూరు పివికెఎన్ క్రీడా మైదానంలో జరిగిన ఎస్‌జిఎఫ్‌యు- 14 సాఫ్ట్‌బాల్ స్టేట్ లెవల్ సెలెక్షన్లలో బాలుర విభాగంలో పునీత్ రెడ్డి, సాయితేజ, బాలికల విభాగంలో ప్రత్యూష అద్భుత ప్రతిభ కనబరిచి ఎంపిక అయ్యారని వారిని అభినందించారు. ఎంపికైన ఈ క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు కడప జిల్లా పులివెందులలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

## చదవడం రాయడం బాగా నేర్చుకోవాలి

ఎంఈఓ విజయకుమారి

**ప్రజాశక్తి- సోమల:** పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని బాగా నేర్చుకుని రాయడం, చదవడం తెలుసుకోవాలని మండల విద్యాశాఖ అధికారిని విజయ కుమారి కోరారు. శుక్రవారం గట్టువారిపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో రికార్డులను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో చదవడం, రాయడం గురించి అడిగి సలహాలు, సూచనలు అందజేశారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు విద్యార్థులు బాగా చదవాలని ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సిమెంట్ రోడ్డుకు మోక్షం


సర్వే నిర్వహిస్తున్న తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది

**ప్రజాశక్తి- కార్వేటినగరం:** కార్వేటినగరం మండలం సిడి కండ్రిగ పంచాయతీ వడ్డీఇండ్లు గ్రామానికి సిమెంట్ రోడ్డుకు సరిపడినంత స్థలం లేకపోవడంతో గ్రామస్తులు గత మూడేళ్లుగా ఇబ్బంది పడేవారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, గంగాధర్ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎస్ థామస్ గత నాలుగు రోజుల క్రితం కార్వేటినగరం వచ్చిన సందర్భంగా సిడి కండ్రిగ, వడ్డి ఇండ్లు గ్రామస్తులు సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం ఎక్కువ స్థలాన్ని కేటాయించి సిమెంట్ రోడ్ నిర్మాణం కోసం స్థలాన్ని సర్వే చేయాలన్నారు. ఎమ్మెల్యే తహసిల్దార్ నాగరాజుతో మాట్లాడి సమస్యను పరిష్కరించి సిమెంట్ రోడ్ నిర్మాణానికి సర్వే చేయించాలని ఆదేశించారు. దీంతో తహసిల్దార్, నగరి డిప్యూటీ ఇన్స్పెక్టర్ రవిశేఖర్ ఆధ్వర్యంలో స్థలాన్ని సర్వే చేయించి, సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో నగరి డిప్యూటీ ఇన్స్పెక్టర్ రవిశేఖర్, సర్వేయర్ మార్కొండయ్య, ఆర్ఐ నరసింహులు, వీఆర్వో చంద్రయ్య, విలేజ్ సర్వేయర్ గురుతేజ, సర్పంచులు మంగమ్మ, గోవిందమ్మ పాల్గొన్నారు.

## ఉచిత రక్త పరీక్ష శిబిరం




**ప్రజాశక్తి -కుప్పం:** కుప్పం కేసి ఆసుపత్రి ఆధ్వర్యంలో శాంతిపురం మండలం కర్లగట్ట జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ఉచిత రక్త పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి వారి బ్లడ్ గ్రూపును నిర్ధారిస్తూ నిర్ధారణ పత్రాలను అందజేశారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, అన్ని దానాల కన్నా రక్తదానం ఎంతో గొప్పదన్న విషయాన్ని విద్యార్థులు గ్రామీణ ప్రాంత ప్రజలకు చైతన్య చేసి రక్తదానం చేసే విధంగా వారిని ప్రోత్సహించాలని కేసి ఆసుపత్రి అధినేత డాక్టర్ మంజునాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసి హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుడు మృతికి ఎమ్మెల్యే సంతాపం

**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** చిత్తూరు రూరల్ మండలం పెద్దశెట్టిపల్లికి చెందిన యువకుడు, కూటమి పార్టీ కార్యకర్త దేవరాల కళ్యాణ్ మృతి పట్ల ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం పెద్దిశెట్టిపల్లిలోని యువకుడి గృహానికి వెళ్లి నివాళులర్పించి, వారి తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే వెంట చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, కాజూరు బాలాజీ, వెంకటేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## బిల్డర్ సాయిని అభినందించిన ఎమ్మెల్యే



**ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:** సంతపేట విజయలక్ష్మి కాలనీలోని పలు అభివృద్ధి పనులను శుక్రవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. ఈసందర్భంగా స్థానిక బిల్డర్ సాయి విజయలక్ష్మి కాలనీలో నిర్మిస్తున్న అపార్ట్మెంట్‌ను సందర్శించారు. ప్రజల సౌకర్యార్థం విజయలక్ష్మి కాలనీలో పెండింగ్లో ఉన్న రోడ్లు, డ్రైనేజీలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి పలువురు తెలుగుదేశం నాయకులు ఆయన్ను అభినందించారు.

## డిప్యూటీ తహశీల్దార్‌గా నరేష్ కుమార్

**ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు:**



గంగాధర నెల్లూరు డిప్యూటీ తహశీల్దార్‌గా నరేష్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కుప్పం ఆర్డీవో కార్యాలయంలోడిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న నరేష్ కుమార్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గంగాధర నెల్లూరు డిప్యూటీ తహశీల్దార్‌గా నియమించారు. ఇక్కడ డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మహేష్ కుమార్ చిత్తూరు ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నరేష్ కుమార్‌కు తహశీల్దార్ కార్యాలయం ఇబ్బంది స్వాగతం పలికారు.

## చెరువుల వేలం పాట



**ప్రజాశక్తి- సోమల:** సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పరిధిలోని చేపల చెరువులకు వేలం పాట నిర్వహించినట్టు సర్పంచ్ రెడ్డప్ప తెలిపారు. సచివాలయంలో నిర్వహించిన చెరువుల వేలంపాటలో చెన్నపట్నం చెరువు ఒక లక్ష 25 వేల రూపాయలకు, మేటిమంద సోమప్ప చెరువు, సాకిరేవు కుంట, కోమటి వానికుంట, శ్రీపతివారి కుంట, ఎల్లమ్మ కుంట, నల్లపువాని కుంట, గంగిశెట్టి కుంట మొత్తం రూ.3800లకు వేలంపాటలో పాటదారులు పాడగా మొత్తం రూ.1,96,500ల ఆదాయం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సివిఎస్‌వి ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, పంచాయతీ కార్యదర్శి మేనక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు




**ప్రజాశక్తి -వెదురుకుప్పం:** డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గ్రంథాలయ శాస్త్రవిభాగం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శుక్రవారం బుక్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద ఆవిష్కరించారు. వివిధ రంగాలకు చెందిన అనేక పుస్తకాలు ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ సైన్స్ డిపార్ట్మెంట్ లెక్చరర్ బి.సతీష్ కుమార్, లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఏసీ.భరణినాథ్ రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేత్ర బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సుహెబ్

**ప్రజాశక్తి- పెద్దపంజాణి :** వైస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మండలంలోని రాయలపేటకు చెందిన యువ నాయకులు వి.సుహేబ్‌ను పార్టీ అధిష్టానం నియమించినట్లు ఆయన శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఏర్పడిన పార్టీ అని, తమ నాయకుడు జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమానికి విశేషంగా శ్రీకారం చుట్టారని ప్రజల్లో ఇప్పటికి గత వైసీపీ ప్రభుత్వం అమలు పరిచిన సంక్షేమ పథకాలు వల్ల లబ్ధి పొందిన అన్ని వర్గాల ప్రజలు వైఎస్ఆర్సిపి వెంటే ఉన్నారని, కచ్చితంగా రాబోయే రోజుల్లో పార్టీ ప్రజాభిష్టం పొందుతుందని అన్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, స్థానిక వైసిపి ఇంచార్జ్ ఎన్.వెంకటేగౌడ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రైతుసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ రాజన్న

**ప్రజాశక్తి- వీ కోట:** ప్రతి రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజన్న తెలిపారు. పలమనేరు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం అనంతరం మొట్టమొదట సారీ శుక్రవారం వి.కోట ఉప మార్కెట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక మండీ వ్యాపారులు, రైతులు, కూటమి నేతలు వారికి స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ ప్రాంగణంలో రైతులతో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఛైర్మన్ మాట్లాడారు. మార్కెట్ విస్తరణ, అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతను ఇస్తూ తమ పాలకవర్గం పని చేస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తమపై పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా అందరి సహకారంతో మార్కెట్‌కు మంచి పేరును తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. పలమనేరులో 33ఎకరాల్లో మోడల్ మార్కెట్‌ను అభివృద్ధి చేయబోతున్నామని, ఆ మార్కెట్‌కు అనుసంధానంగా ఉన్న వి. కోట మార్కెట్‌ను కూడా అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. మార్కెట్ పరంగా ఏ సమస్య ఉన్నా రైతులు, వ్యాపారస్తులు తమ దృష్టికి తీసుకొస్తే పాలకవర్గంతో చర్చించి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం మార్కెట్ ప్రాంగణంలో కూరగాయలు, పూల మార్కెట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ దిలీప్ కుమార్ , మాజీ ఏఎంసీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, రాష్ట్ర వేర్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్ పాల్గొన్నారు.

## రైతుల ఆర్థికాభివృద్ధి కోసమే..



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్

**ప్రజాశక్తి- సోమల (సదుం):** రైతుల అభివృద్ధి కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఏర్పాటు చేసి రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందించి వారు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నామని సదుం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్ సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం పిఎసిఎస్ కార్యాలయంలో సంఘ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. మేనేజర్ నాగమణి మాట్లాడుతూ రైతులకు సెటిల్మెంట్ భూములు ఉంటే వాటికి రూ.లక్ష నుండి ఐదు లక్షల వరకు రుణాలు అందజేస్తామని, క్రాప్ లోన్లు 13 శాతం వడ్డీతో అందిస్తున్నామని ముఖ్యంగా రైతులు పీఎం ఎస్బివై, పిఎంజెజెవై ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే 18 నుండి 50 సంవత్సరాల లోపు ఉన్నవారు ఏడాదికి రూ.500లు ప్రీమియం చెల్లిస్తే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు రూ.2 లక్షల వరకు బీమా అందించే అవకాశం ఉందని తెలిపారు. సూపర్వైజర్ ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళా సంఘాలకు కూడా రుణాలు అందిస్తామని మూడు లక్షల నుండి 20 లక్షల వరకు సంఘాలకు 10 శాతం వడ్డీతో రుణాలు అందించి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సహకారం అందిస్తామని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఈవో రమణయ్య మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని క్వింటాలు రూ.2300లతో తాము కొనుగోలు చేస్తామని బాగా ఆరబెట్టిన ధాన్యాన్ని రైతులు తీసుకువస్తే కొనుగోలు చేసి బయట మార్కెట్ కంటే అధిక ధరను చెల్లిస్తామన్నారు. గోడౌన్లు ఇప్పటికే మండలంలో మూడు నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయని తాము పండించిన పంటలను గోడౌన్లలో రైతులు నిల్వ చేసుకోవచ్చునని మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ నందిని, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ టి.మొగిలి మృతి

పట్టు సాగు విస్తరణకు విశేష కృషి చేసిన మొగిలి



**ప్రజాశక్తి- వి.కోట:** కుప్పం, వి కోట పరిధిలో పట్టు పరిశోధనా విస్తరణ కేంద్రంలో గతంలో శాస్త్రవేత్తగా విధులు నిర్వహించిన విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ టి.మొగిలి శుక్రవారం ఆకస్మికగా మృతి చెందారు. వి.కోట, కుప్పం పరిధిలో పట్టు రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం పట్టుపురుగుల పెంపకంలో విశేష సేవలందించి దక్షిణ భారతదేశంలో పట్టు పరిశ్రమ వి.కోట, కుప్పం ప్రాంతాన్ని అగ్రగామిగా నిలిచేట్టు చేసిన శాస్త్రవేత్త డాక్టర్ టి.మొగిలి సేవలను రైతులు గుర్తు చేసుకున్నారు. పట్టుపురుగులు చాకీ కేంద్రం నుండి పట్టుగూళ్ళు మార్కెట్ దశ వరకు చేపట్టే ప్రతి ప్రక్రియలోనూ రైతు వద్దకే చేరి క్షేత్రస్థాయిలో సూచనలు సలహాలు అందించి రైతుల ఉన్నతికి ఎంతగానో దోహదపడ్డారని వారి సేవలను రైతులు గుర్తు చేసుకుంటున్నారు. పట్టు రైతులకు అవగాహన కల్పించేందుకు పుస్తకాలు రచించి వారికి ఎంతగానో దోహదపడ్డారు. శాస్త్రవేత్త- మొగిలి కృషిని అభినందిస్తూ 2019లో లూయిస్ పాస్టర్ అవార్డు వరించింది. ఈ అవార్డు అంతర్జాతీయ పట్టు పరిశ్రమ వర్క్ షాప్‌లో జపాన్ సంస్థ ప్రధానం చేసింది. తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో జన్మించిన మొగిలి అక్కడే విద్యాభ్యాసం పూర్తి చేశారు. కాకతీయ యూనివర్సిటీలో పట్టు పరిశ్రమ విభాగంలో పిహెచ్‌డి పూర్తి చేసి మైసూరులోని సెంట్రల్ సిల్క్ బోర్డులో 1987లో రీసెర్చ్ స్కాలర్‌గా శాస్త్రవేత్తగా ఉన్నత స్థానానికి చేరుకున్నారు. అనంతరం చిత్తూరు జిల్లా కుప్పం, వి.కోట ఆర్‌ఇసికి బదిలీపై వచ్చారు. ఇక్కడ వి-1 జీ- 4 వంగడాల అభివృద్ధికి విశేష కృషి చేసి వి1వంగడం మల్బరి ఆకు వాడకాన్ని రైతులకు అందించి అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేశారు. దేశవాలి పట్టు పరిశ్రమ నుండి సాంకేతికతను ఉపయోగించి పట్టు దిగుబడి పెంచేందుకు విశేష కృషి చేశారు. మారుమూల గ్రామం నుండి అత్యున్నత స్థాయికి ఎదిగినా శాస్త్రవేత్త తాళ్లపల్లి మొగిలి కుటుంబ సభ్యులకు స్నేహితులు, పట్టు రైతులు సహచర ఉద్యోగులు, డాక్టర్ తాళ్లపల్లి మొగిలి మృతి పట్ల తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# 'టెట్ ' నుంచి మినహాయింపు ఇవ్వాలి



**ప్రజాశక్తి- యాదమరి:** మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యల సేకరణ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జరిగినది. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు పొందడానికి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వెంటనే వేయాలని, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి విద్యాహక్కు చట్టానికి పార్లమెంటులో చట్ట సవరణ చేసి 2009కి ముందు వివిధ డీఎస్సీల ద్వారా ఎంపిక కాబడిన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని ఈ మేరకు కేంద్ర మానవ వనరుల శాఖను ఒప్పించి చట్ట సవరణకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. మహిళ ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్ సవరణ జీవో వెంటనే విడుదల చేసి వయసుతో నిమిత్తం లేకుండా వారి సర్వీసులో ఎప్పుడైనా వినియోగించుకునే అవకాశం కల్పించాలని, ఉమ్మడి సర్వీస్ నిబంధనలు రూపొందించి అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు సుమారు 30వేల కోట్లు దశలవారీగా ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు జానకిరామ్, మణి, సుబ్రహ్మణ్యం పిళ్ళై, గణపతి, కుమార్ స్వామిరెడ్డి పాల్గొన్నారు.